జోరుగా మద్యం సిండికేట్ దందా

- ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.15 వసూలు
- బెల్ట్ షాపులకు వైన్స్‌ల నుంచి ఆటోలో విచ్చలవిడిగా మందు సరఫరా
- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

అనంతగిరి : మండల కేంద్రంలో మద్యం సిండికేట్ వ్యాపారుల దందా ఇష్టారాజ్యంగా సాగుతోంది. బెల్ట్ దుకాణాలకు ఒక్కో మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.15 అదనంగా వసూలు చేస్తూ విక్రయిస్తున్నారు. మద్యం సీసాపై సిండికేట్ గుర్తుగా ఓ స్టిక్కర్‌ను అతికించి ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా మద్యం దుకాణాలు వెలిశాయి. మండలంలోని 19 గ్రామపంచాయతీలు, 23 గ్రామాలు ఉండగా ఒక్కో గ్రామంలో సుమారు ఐదుకు పైగా అక్రమ మద్య దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే సుమారు 20కి పైగా ఉన్నాయి. భారీ స్థాయిలో అక్రమ దుకాణాలు నెలకొల్పినప్పటికీ అధికారులు తమ దృష్టికి రాలేదంటూ చెప్పడం హాస్యాస్పదమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గ్రామాల్లో అక్రమంగా నిర్వహించే బెల్ట్ దుకాణాలకు మండల కేంద్రంలోని ఓ వైన్స్ నుంచి ఆటోలో మద్యం సరఫరా చేస్తున్నారు. సిండికేట్ స్టిక్కర్ ఆర్‌ఎస్‌ఎం అనంతగిరి పేరు ఉన్న మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముకోవచ్చని అక్రమ బెల్ట్ దుకాణాదారులకు సిండికేట్ నిర్వాహకులు హామీ ఇవ్వడం గమనార్హం. తమ పరిధిలోని గ్రామాల్లో గల బెల్ట్ దుకాణాలు అనంతగిరి సిండికేట్ వైన్స్‌ల నుంచే మద్యం కొనుగోలు చేయాలంటూ నిబంధనలు పెట్టడమంటే సిండికేట్ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా సిండికేట్ వ్యాపారులు బెల్ట్ షాపుల్లో దౌర్జన్యంగా దాడులు నిర్వహించి స్టిక్కర్ లేని మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడం పరిపాటిగా మారింది. మండలంలో అక్రమ మద్యం అమ్ముతున్నట్లు కాని, వారికి మద్యం అధిక ధరకు సరఫరా చేస్తున్నట్లు కాని తమ దృష్టికి రాలేదని గత ఆరు నెలలుగా అటువంటి కేసులు కూడా నమోదు కాలేదని ఆబ్కారీ శాఖ పోలీసులు చెబుతున్నారు. సిండికేట్ మద్యం దందా జోరుగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్స్ నిర్వాహకులపై, గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అనంతగిరిలోని వైన్స్ నుంచి ఆటోలో తరలిస్తున్న మద్యం

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవు

మద్యం అక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటాం. మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మా దృష్టికి వస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. అనంతగిరి మండలంలో సుమారు గత ఆరు నెలలుగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

– రామకృష్ణ, ఎక్సైజ్ ఎస్‌ఐ, అనంతగిరి

శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- ఎస్పీ నరసింహ

చిలుకూరు : గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు చిన్న చిన్న విషయాలకు ఘర్షణలు పడవద్దని సూచించారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, అందుకు పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తారని తెలిపారు. పోలీసులతో ప్రజలు, యువకులు ఫ్రెండ్లీగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామాల్లో యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగభూషణ్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐలు అనిల్‌రెడ్డి, నవీన్, పరమేష్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బేతవోలులో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

నడిగూడెం : చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం నడిగూడెం మండలంలోని వల్లాపురంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రమ శిక్షణతో ఉండాలన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉంటేనే యువత మంచి మార్గంలో నడుచుకుంటారని అన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలన్నారు. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, కావున సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


వల్లాపురంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మునగాల : కోదాడ ఆర్టీసీ డిపో నుంచి మునగాల మండల కేంద్రం మీదుగా మండలంలోని గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, గరిడేపల్లి మండలం వెలిదెండ, కీతవారిగూడెం మీదుగా హుజుర్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నాలుగు మండలాల ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం కోదాడలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని తెలిపారు. విద్యార్థులు కోదాడ, సూర్యాపేట పట్టణాలలో చదువుకోవడానికి వెళ్లాలంటే మండల కేంద్రం వరకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించాలని గతంలో స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించినప్పటికీ నేటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాయకులు మిట్టగణుపుల ముత్యాలు, నందిగామ సైదులు, రేఖ లింగయ్య ఉన్నారు.


కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : మే 20న నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు, బ్యాంకు ఫెడరేషన్లు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సీఐటీయూ ముఖ్య నాయకుల, రైస్ మిల్లు డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సంపద సృష్టించేది కార్మికులేనని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఫలితంగా 8 గంటల పని విధానం పోయి 12 గంటలకు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరపయ్య, శ్రీను, వెంకటమ్మ, గోపమ్మ, సైదమ్మ, పద్మ, ఈశ్వరమ్మ, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు


లారీ డ్రైవర్‌ను బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్‌ఐ ముత్తయ్య హెచ్చరించారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని మెయిన్ రోడ్డు చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఒక లారీ డ్రైవర్ విజయ రాజుకు బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షించగా 538 ఎంజీగా నమోదుకావడంతో కేసు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మరొక లారీ డ్రైవర్ పైన కూడా కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ముఖ్యంగా ట్రక్కులు, భారీ వాహనాల డ్రైవర్లు తాగి నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001– 02లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆనాడు పాఠాలు బోధించిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జలగం జనార్దన్ సేవలు మరువలేనివి

సూర్యాపేట అర్బన్ : విప్లవమే వృత్తిగా ఎంచుకున్న త్యాగధనుడు జలగం జనార్దన్ సేవలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనార్దన్ నాలుగో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జనార్దన్ తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చారని అన్నారు. ఈ నెల 21నుంచి 25వరకు నిర్వహించే వర్ధంతి సభలను జయప్రదం చేయాలన్నారు. ఈ నెల 20న జాజిరెడ్డిగూడెం, 21న ఏపూరు, వెలిదండ, 22న డి.కొత్తపల్లి, 23న చిల్పకుంట్ల, 24న రాయిపాడు, 25 సూర్యాపేట పట్టణంలో వర్ధంతి సందర్భంగా స్మారక ఉపన్యాసం ఉంటుందని ఈ సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అనుభవిల్లి వెంకట్‌రెడ్డి, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి సైదులు, అరుణోదయ జిల్లా నాయకుడు తడకమళ్ల నాగమల్లు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, జిల్లా నాయకులు రామలింగమ్మ, జయసుధ, ప్రవీణ్, కార్తీక్, వీరన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో సవరణలకు సహకరించాలి


సమావేశంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు

హుజూర్‌నగర్ : ఓటర్ లిస్ట్‌లో సవరణలకు సహకరించాలని తహసీల్దార్ ఎం.నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైన ఓటరు చనిపోతే అతని పేరును ఓటరు జాబితా నుంచి తొలగించాలని అన్నారు. అందుకు మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలని చెప్పారు. ఓటర్ లిస్ట్ సవరణ, పోలింగ్ బూత్‌లు, ఎన్నికల విషయాలపై నాయకులతో చర్చించారు. ఓటరు జాబితా నవీకరణపై తగిన సూచనలు, సలహాలు అందజేయాలని అన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తెలుసుకోవాలని ఆయన చెప్పారు. సమావేశంలో నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, ఈడ్పుగంటి సుబ్బారావు, గుండు వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాంబాబు, ఆర్ మురళి, కె.వెంకటేశ్వర్లు, కె.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి


మహాసభ కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని గానుగబండ గ్రామంలో ఈ నెల 17న నిర్వహించబోయే సీపీఐ 15వ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం మండలంలోని గానుగబండ గ్రామంలో మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద ఏళ్లుగా పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అచ్చయ్య, కుందూరి వెంకటరెడ్డి, ఈదా సైదులు, అంబటి వెంకట్‌రెడ్డి, గోవిందరెడ్డి, పాలెల్లి సైదులు, పోకల ఆంజనేయులు, హిమాంబి, పోకల నరసింహారావు, పంగ సైదులు, నిమ్మల వెంకటేశం, తాళ్ల తిరపయ్య, షేక్ ఖాసీం సాహెబ్, షేక్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

సూర్యాపేట అర్బన్ : ప్రపంచ అందాల పోటీల పేరుతో వివిధ మహిళా, యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా వివిధ మహిళా, యువజన సంఘాల నాయకులు అక్రమంగా అరెస్టు చేయడం, పోలీస్‌స్టేషన్లలో గంటల తరబడి కూర్చోబెట్టడం తగదన్నారు. సమావేశంలో తెలంగాణ మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు హేమలత, నాగయ్య, రామలింగమ్మ, జయసుధ, పద్మ పాల్గొన్నారు.

వైభవోపేతం.. విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం


అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

అనంతగిరి : మండలంలోని మొగలాయికోట గ్రామంలో శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం, నవగ్రహ, ఆంజనేయ, వీరభద్ర, సుబ్రహ్మణ్య, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. సుమారు పది గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో మొగలాయికోటలో పండుగ వాతావరణం నెలకొన్నది. భక్తులు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. వేడుకకు కోదాడ ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి ఆలయానికి రూ.21,121 విరాళం అందజేశారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు సింగారెడ్డి నారాయణరెడ్డి, అప్పిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పెళ్లికొడుకు వెంకటేశ్వర్లు, గాయం అప్పిరెడ్డి, మోత్కూరి శ్రీనాథ్, వెంకటాచారి, రాఘవరెడ్డి, మామిడి వెంకటి, గురవయ్య, శ్రీను, పొర్ల రాంబాబు, జడ వెంకటేశ్వర్లు, వీరస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, సింగారెడ్డి కిరణ్, వీరబాబు, మాజీ సర్పంచ్ పోర్ల ఉమాసత్యనారాయణ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ వైద్యుడు సుబ్బారావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్, తదితరులు

జూన్ రెండు నుంచి 'భూ భారతి' అమలు

- కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ

అనంతగిరి : జూన్ రెండవ తేదీ నుంచి భూ భారతి చట్టం అమలవుతుందని కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ తెలిపారు. బుధవారం అనంతగిరి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రెండు టీమ్‌లుగా గ్రామాల్లోకి వెళ్లి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు దరఖాస్తు పత్రాలను రెవెన్యూ అధికారులు అందజేస్తారని తెలిపారు. దరఖాస్తు పత్రానికి రైతులు భూ సంబంధిత ధృవీకరణ పత్రాలను జత చేసి ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.హిమబిందు, ఆర్‌ఐ వెంకటనగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


భూభారతి చట్టంపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ

'డబుల్' ఇళ్లకు నిధులు మంజూరు చేయాలి

మునగాల : మండల కేంద్రంలో గత కొంతకాలంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని, 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో మునగాలలో కనుమరుగైన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని కోదాడ ఎమ్మెల్యే నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో మండల కేంద్రానికి సుమారు 76 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు కాగా కాంట్రాక్టర్ నిధులు మంజూరు కాలేదని మధ్యలో నిలిపివేసినట్లు తెలిపారు. దీంతో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పుల జానకిరెడ్డి, కాసర్ల శ్రీనివాసరావు, ఎండీ.రషీద్, కొమ్ము ఈదారావు, భీంపంగు శంకర్, పంది జాను పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పద్మావతితో మాట్లాడుతున్న మునగాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఒక్కటే బస్సు.. వందలాది జనం

- కోదాడ – దొండపాడు ప్రయాణానికి ప్రజలకు తప్పని తిప్పలు

కోదాడ : ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం కోదాడ బస్టాండ్‌లో కోదాడ నుంచి దొండపాడు వెళ్లే బస్సు వద్ద బుధవారం సాయంత్రం కనిపించింది. కోదాడ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న అతిపెద్ద గ్రామపంచాయతీ దొండపాడు. ఈ గ్రామానికి కోదాడ నుంచి ఒక్క బస్సు మాత్రమే ఉంది. అది కూడా ఉదయం, సాయంత్రం ఒక్క ట్రిప్పు మాత్రమే నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం సాయంత్రం బస్సు వచ్చే సమయానికి 300 మందికి పైగా ప్రయాణికులు అక్కడ వేచి ఉన్నారు. బస్సులో 100 మందికి పైగా కిక్కిరిసి ఎక్కారు. ఇంకా 2 వందల మందికి పైగా ప్రయాణికులు మిగిలిపోయారు. గ్రామానికి ఈ బస్సు వెళ్లే రాత్రి 9 గంటల తరువాత మరో బస్సు ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. 10 వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామానికి బస్సుల సంఖ్య పెంచాలని అనేకసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని పలువురు మహిళలు వాపోతున్నారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వారు అంటున్నారు. ఈ విషయంలో మంత్రి జోక్యం చేసుకొని దొండపాడు గ్రామానికి బస్సుల సంఖ్య పెంచడంతో పాటు బస్సు ట్రిప్పుల సంఖ్యను కూడా పెంచాలని వారు కోరుతున్నారు.


కోదాడ- దొండపాడు బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

కోదాడరూరల్ : ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. బుధవారం కోదాడ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద మినీ ట్యాక్సీ డ్రైవర్లకు, పలు రకాల వాహనదారుకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని అన్నారు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపొద్దని హెచ్చరించారు. వాహనపత్రాలు అన్ని సరిగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. మైనర్లకు వాహనాలిస్తే జరిమానా తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల: మునగాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గణపవరం ఫీడర్‌లో విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామంలో, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉపకరణాల కోసం 160 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ఉపకరణాల కోసం హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని టౌన్ హాల్‌లో జిల్లా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, సీడీపీఓ వెంకటలక్ష్మి బుధవారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల నుంచి 160 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య, సూపర్‌వైజర్ రవికుమార్, అలీంకో సంస్థ స్టాఫ్ రష్మీ, రాజబాబు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, దివ్యాంగులు, వయోవృద్ధులు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

మునగాల : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అందజేసే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పొనుగోటి రంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనేక షరతులు విధించి రుణ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. లేనిపక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో దరఖాస్తుదారులందరికీ అండగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రంగా హెచ్చరించారు. రుణాల మంజూరులో స్థానిక ఎమ్మెల్యే, రాజకీయ నాయకుల ప్రమేయం ఉండొద్దన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో బ్యాంకుల జోక్యం లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రంగా కోరారు.

రాజీవ్ యువ వికాసం.. నిరుద్యోగులకు వరం

హుజూర్‌నగర్ : రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరం అని టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. బుధవారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాజు, వీరబాబు, రామరాజు, శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన దాసరి యాదగిరికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సభ్యుడు లచ్చిమల్ల నాగేశ్వరరావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడితండా శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ముగ్గురిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తండా శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గుగులోతు శ్రీను, బడావత్ నాగరాజు, సైదాలు పేకాట ఆడుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2900 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండలంలోని కరివిరాలలో గల శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద వినియోగం, రథోత్సవం, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గీతా కార్మికుడికి గాయాలు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన టంగుటూరి శంభులింగం వృత్తి రీత్యా గీత కార్మికుడు. రోజులాగే ఈ నెల 10న తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు పైనుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం తనభర్తను ఆదుకోవాలని బాధితుడి భార్య నాగమ్మ కోరారు.